# ప్రేమవెన్నెల

-డా॥ చిల్లర భవానీదేవి

'మనూ! ఓ మనూ!' నిద్రపోతున్న మనోజ్ భుజాలు పట్టి కుదుపుతూ లేపుతోంది ఉష.

'ఉషా! ఉండు ఫైవ్ మినిట్స్ ప్లీజ్! నువ్వు కూడా పడుకో రా!' ఆమె చేయిపట్టి లాగి దగ్గరిగా హత్తుకొని కళ్లు మూసుకున్నాడు. మత్తుగా మనోజ్. భర్త చిలిపి చేష్టలకు, ప్రేమకు మరో రోజైతే సంతోషించేదే ఉష, కానీ ఆరోజు.

'అమ్మో! ఉలిక్కపడింది. భర్త చేతిని మెల్లగా తొలిగించి మంచం మీద బాసింపట్టు వేసుకొని కళ్లు పెద్దవి చేసుకొని మనూ వైపు చూసింది.

పచ్చని కోలముఖం, నలిగిన క్రాపు నిద్రలో కూడా చిరునవ్వు చెరగని పెదవులు కొద్దిగా గడ్డం మాసినట్లుంది అయినా అందంగానే కన్పిస్తున్నాడు. ఒక్కక్షణం అతన్ని అలాగే చూస్తుండి పోయింది.

అందగాడే! ఐశ్వర్యవంతుడు మరి తనకింత చిరాకు ఎందుకు?

ప్రేమగానే చూస్తాడు. అదే! ఆ ముసలావిడ వల్ల వచ్చిపడింది గొడవంత.

కాలేజీలో చదివేపుడు ఎన్ని కలలు కంది? పోస్టు గ్రాడ్యుయేషన్ చదవటం పూర్తయిన తర్వాత ఓ కాలేజీలో లెక్చరర్‌గా పిల్లల్ని విజ్ఞానవంతుల్ని చేస్తూ హుం నిట్టూర్చింది ఉష. అందమైన ఆ కల కరిగి పోయింది. ఎన్నుకొని ఏం లాభం ఏదో పెళ్లిలో తనను చూసిన తననే చేసుకుంటానని పట్టుపట్టి రాయబారాలు పంపటం, తనమాట ఎవ్వరూ పట్టించు కోకుండా పెళ్లి, అంతా అదృష్టం కల్సివచ్చిందన్న వాళ్లే! అమ్మ మాటలు విని తను కూడా మనసు మార్చుకొని చదువు ఆపి పెళ్లిచేసుకొంది.

మనూ ఆ రాత్రి చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి.

"ఈ ఇంట్లో నిన్ను ఎవరూ ఏమీ అనరు కానీ బామ్మతో మాత్రం కొంచెం సర్దుకుపో. ఆవిడకు మా ఇంట్లో ఎవ్వరూ ఎదురు చెప్పరు."

ఆ మాటల కర్థం క్రమక్రమంగా తెలిసి వస్తున్నది తను ఏ పని చేసినా ఆవిడకు నచ్చదు.

"ఏం మనవలారా! పుస్తకాలు చదవటమేనా? వంట నేర్పలేదా మీ అమ్మ మా రోజుల్లో అయితే" అంటూ మొదలెట్టేది. పెద్దావిడ మాటలకు జవాబు చెప్పకూడదు కదా.

ఉష మౌనంగా లేచి అక్కణ్నుంచి వచ్చేసింది మనసులో మాత్రం మనలాగా చదువుకుంటే గదా అనుకుంది. అసలు అమ్మా నాన్న తనని చదివించే బదులు చిన్నప్పటి నుంచి ఓ వంటలక్క లాగా తయారు చేస్తే ఈవిడకి నచ్చేదేమో! మనసు అంతా కుతకుతలాడి పోయింది. అసలు తను ఈవిడకి నచ్చడం దేనికి? మనూకి నచ్చింది అది చాలు. మనూ కూడా తనకి ప్రాణం అంతే.

ఇంకోరోజు మధ్యాహ్నం అన్నం తినగానే కంచాలు తీసేసి గదిలోకి వచ్చి పడుకుంది. ఏదో నవల చదువు కుంటూ తనదైన ప్రపంచంలో విహరిస్తోంది. ముసలావిడ కంచు కంఠం ఫుల్‌స్టాప్, కామాలు లేకుండా మోగుతున్నది. అత్తగార్ని దబాయిస్తూ సతాయిస్తోందావిడ.

ఏమిటి లక్ష్మీ! నీ కోడలు తినటం పడుకోవటమేనా? కాస్త ఏవైనా అల్లికలు, కుట్లు ఆ పని చేయొచ్చు కదా మధ్యాహ్నం పూట. మా రోజుల్లో అయితేనా ఎన్నెన్ని డిజైన్లు కుట్టేవాళ్లం.

ఏమిటి లక్ష్మీ నీ కోడలు తినటం పడుకోవటం.

అత్తగారు చిన్న చిరునవ్వి నవ్వి ఊరుకోవడం చూస్తే మరీ మరీ కోపం వచ్చేది ఉషకి.

అత్తగారు ఉషను ఏమీ అనదు. కనీసం ప్రేమగా మందలించదు కూడా. తన అత్తగారికే లేని బాధ ఆ ముసలావిడకెందుకో ఓ మూల కూర్చోక అందరి మీదా పెత్తనం చేస్తుంది.

ఆ ముసలావిడ కూడా అంతే! హవ్వ! ఈ వయస్సులో కూడా ఆవిడ ఎంతంటే అంతే! అసలు ఆవిడ పెత్తనమేమిటి? అత్తగారికి అత్తగారు, అంతే గదా విడ్డూరం కాక ఇన్నేళ్లొచ్చినా మామగారు కూడా తల్లికి బదులు చెప్పలేదు. నౌకర్లందరికీ ఆవిడంటే హడల్. ఇంక మనూ మాట చెప్పేదేముంది, నాయనమ్మ కొంగు పట్టుకొని నోట్లో వేలేసుకొని అడుగుతుంటాడు ఛ.

ఏంటోయ్ పొద్దున్నే లేచి మంచం మీద మరంవేసి ఆ ఆలోచన.

మీ గురించే.

నా గురించా? చెప్పవూ? ఇంట్రస్టింగ్‌గా తల కొంచెం ముందుకు వంచి అడిగాడు.

ఆ పోజుకు నవ్వొచ్చింది ఉషకు. ఏంలేదు, పడుకోండి. కాసేపు తెల్లారితే బామ్మగారి హడావుడికి ఎవ్వ

రికీ నిద్ర వుండదు.

'ఒక్కద్దేనా?' చేయిపట్టి లాగాడు. ఆ విసురుకు వెళ్లి అతని విశాల వక్షస్థలం మీద పడింది ఉష.

అతని రెండు చేతులు ఆమెను ప్రేమతో చుట్టే శాయి. అతని బాహుబంధాలలో కాలం కరిగి పోయింది. భర్త ప్రేమలోపడి కొట్టుకుపోయి నిద్రలోకి జారిన ఉషకు తెల్లగా తెల్లారితేగానీ మెలకువ రాలేదు. మెలకువ వచ్చేసరికి ముసలావిడ కేకలు విన్పిస్తు న్నాయి. ఆ మహారాణి లేవలేదు. ఇవ్వాళ కూడా ఎండెక్కి లేవటం? ఏమిటి లక్ష్మీ నీ ట్రయినింగ్? ఉష అత్తగార్ని కేకలేస్తున్నది ఆ ముసలావిడ. అయినా బామ్మ గారి పుట్టిన రోజైతే అందరూ హడావుడి. అత్తగారి నోరు మెదపడం లేదు. ఉష హడావుడిగా లేచి పళ్లు తోముకుని కాఫీ తాగింది. అదే హడావుడిగా స్నానం చేసి వంటింట్లోకి జొరపడింది. గుమ్మంలోనే నిలేసింది పెద్దావిడి.

ఆ సరికే ముసలావిడ. అత్తగారు పూజ ముగించి గుడికి బయలుదేరారు. ఇవ్వాళ నాన్న పుట్టిన రోజు చూడమ్మాయ్. మేం గుడికి వెళ్తున్నాం. వచ్చేసరికి వంట పూర్తిచేయి. మామూలు వంట గాక గులాబ్‌జాం, ఆ వడలు, పులిహోర. ఆవిడ చెప్తున్న లిస్టు సగమే విన్పిం చింది ఉషకు. వింటుంటేనే పై ప్రాణాలు పైనే పోయాయి.

లిస్టు పూర్తికాగానే చేతిలో జపమాలతో పెద్దావిడ పూజా సామాగ్రితో అత్తగారు కారెక్కారు.

ఇంక ఉషకు దడగా ఉంది. వంటే సరిగా రాదే! ఇవన్నీ ఎలా చేయాలి. ఎలా చెయ్యాలి? మనూ! ఓ మనూ! సీరియస్‌గా భర్తని లేపింది. విషయం చెప్పింది ఆదుర్దాగా!

ఇంతేనా. ఉష ముక్కు పట్టి ఊపాడు. అల్లరిగా చాల్లే సంబడం. నేనింత హైరానా పడుతుంటే నీకు ఆటగా ఉంది. బుంగమూతి పెట్టింది ఉష. హైరానా ఎందుకోయ్? పద! ఐదు నిమిషాలలో నేనూ వస్తున్నాను. నాకవన్నీ తెల్సు, ఎలా చేయాలో నేనూ చెప్తాను. ఇద్దరం కలిసి వంట పూర్తిచేద్దాం. 'వివాహ భోజనంబు..' పాట పాడుకుంటూ బాత్‌రూంలోకి దూరాడు మనూ.

స్నానంచేసి లుంగీ పైకి కట్టి తలకి టవల్ చుట్టుకొని వచ్చిన మనూని చూస్తుంటే గమ్మత్తుగా ఉన్నాడు.

ఏం చూస్తావ్! పద నడుము మీద చెయ్యేసి వంటిం ట్లోకి తీసుకెళ్తున్న భర్త చేతిని సున్నితంగా వదిలించు కొని నడిచింది ఉష. ఈ ప్రేమ కోసమే తను ఇంతగా కట్టుబడిపోయింది మరి.

ఇద్దరూ కలిసి చాలావరకు వంట పూర్తిచేసేశారు. మనూకి నిజంగానే వంట వచ్చని ఉషకి తెల్సి పోయింది.

ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపు సొలుపే మున్నది.

మనూ కూనిరాగాలు వంటిల్లంతా తిరిగొచ్చి ఉషని చుట్టేస్తున్నాయి. వాజమ్మ పెళ్లాంకి వంటింట్లో సాయం చేస్తున్నాడు.

లక్ష్మీ! చూడు నీ కొడుకూ కోడళ్ల వరస నాకేం నచ్చలేదు. పెద్దావిడ కేకలకి ఇద్దరూ హడలిపోయారు.

వంటరాని పిల్లను అంటగట్టారు. ఎప్పుడూ నిద్ర దయ్యాన్ని కళ్లమీద ఎక్కించుకుని తిరుగుతుంది. వీడో చవట. ఎలా సాయం చేస్తున్నాడో చూడు.

బిక్క చచ్చిపోయింది ఉష. అసలే ఉదయం నించే ఏమీ తినలేదు. పైగా పని ఎక్కువయింది. దడగా ఉంది. చెమటలు పడుతున్నాయి. నేలమీద ఒరిగి పోతున్న ఉషను మనూ పొదివి పట్టుకొని ఎత్తుకొని మంచంపై చేర్చాడు.

లేడి డాక్టరు మాటలకు పెద్దావిడ కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

ఆమె చూపులు అపురూపమైన వస్తువును చూస్తు న్నట్లు ఉషవైపే అంటుకుపోయాయి.

డాక్టర్‌కి బొట్టుపెట్టి పట్టుచీరె అందిస్తున్న కోడలు లక్ష్మికేసి ప్రశంసగా చూసిందావిడ.

'చల్లగా ఉండే డాక్టరమ్మా, మంచి శుభవార్త మాకు, మా మనూ పుట్టిన రోజునాడు' ఆర్ద్రంగా పలికిందావిడ.

డాక్టరు సలహా చెప్పి వెళ్లిపోయింది.

చిరునవ్వుతో వీపు నిమురుతూన్న పెద్దావిడ్ని చూసి స్పృహలోకి వచ్చిన ఉష కంగారుగా లేవబోయింది.

'లేవకు. ఈ రోజున నువ్విస్తున్న బంగారు కానుక నా చేతుల్లోకి వచ్చేదాకా నేను నీ దగ్గరే ఉండి నీక్కావలసినవి చూస్తా. ఇంక నువ్వు ఏ పనీ చేయ టానికి వీల్లేదు. అంతే!"

ఆవిడ కంఠంలో సముద్రమంతటి ఆప్యాయత.

'థాంక్యూ ఉషా!' భార్య నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూ ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు మనూ.

ఒరేయ్ మనూ, నా మనవరాలు బంగారు పిల్ల. ఇంక దాన్ని శ్రమపెట్టకు. ఉష చేతి మీద చేయి వేసి నిమిరిందావిడ. ఆ స్పర్శ ప్రసాదిస్తున్న ప్రేమానురాగా లకు ఉష కళ్లలో నీళ్లూరాయి.

గాఢంగా ఆవిడను హత్తుకుపోయి ఆవిడ భుజంపై తలానాన్చింది ఉష చాలా ఇష్టంగా. ఇప్పుడు ఉష మనసునిండా బామ్మగారి పట్ల ఆకాశమంత ప్రేమ వెన్నెల్లా పరచుకుంది. ■